ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కాకినాడ
జిల్లా వార్తలు

మంగళవారం 20 ఆగస్టు 2024 | 5

నేడు జేఎన్టీయూకే 16వ ఆవిర్భావ దినోత్సవం

- ముఖ్యఅతిథిగా ఏపీఎస్సీహెచ్ఈ ఇన్‌ఛార్జి చైర్మన్ రామ్మోహన్‌రావు
- కృష్ణతేజ, రామకృష్ణలకు యంగ్ అఛీవర్స్ అవార్డుల ప్రదానం

పిఠాపురంలో రాఖీ పౌర్ణమి



పిఠాపురంలో శ్రీపాదశ్రీవల్లభుడికి రాఖీ కడుతున్న భక్తులు

రాఖీ పండుగ వేళ విషాదం





సంఘటనాస్థలంలో ఉప్పరపల్లి దేవి మృతదేహం.. ఇన్‌సెట్‌లో దేవి(ఫైల్‌ఫొటో)

- ఆటోను వేగంగా ఢీకొన్న లోడు ఆటో
- అన్నయ్యకు రాఖీ కట్టి ఇంటికి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో బాలిక దుర్మరణం
- కొత్తపల్లి మండలం కొత్తమూలపేట వద్ద దుర్ఘటన

కొత్తపల్లి, ఆగస్టు 19: రాఖీపౌర్ణమి రోజున విషాదం చోటుచేసుకుంది. వరుసకు అన్న అయ్యేవారికి రాఖీ కట్టేందుకు వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో ఓ బాలికను మృత్యువు కబళించింది. కొత్తపల్లి మండలం పొన్నాడ శివారు కోనపాపపేటకు చెందిన బాలిక ఉప్పరపల్లి దేవి(11) స్థానికంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. సోమవారం రాఖీ పండుగ కావడంతో ఆమె పాఠశాలకు వెళ్లలేదు. కొత్తపల్లి మండలంలోని అమీనాబాద్‌లో ఉండే అన్న(పెదనాన్న కుమారుడు) దగ్గరకు వెళ్లేందుకు కోనపాపపేటనుంచి ఆమె ఆటోలో వెళ్లింది. అక్కడ రాఖీ కట్టింది. తిరుగు ప్రయాణంలో ఆటోలో కొత్తమూలపేట రొయ్యల శుద్ధి చేసే కేంద్రం సమీపించేసరికి ఉప్పాడనుంచి ఎదురుగా వేగంగా వస్తున్న లోడు ఆటో వీరి ఆటోను బలంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆటోనుంచి దేవి ఎగిరి రోడ్డు పై పడగా తలకు బలమైన గాయమైంది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందగా మరో 8మందికి గాయాల య్యాయి. గాయాలైన వారిని చికిత్స నిమిత్తం పిఠాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కొత్తపల్లి పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అర్జీలను గడువు లోపు పరిష్కరించాలి: కలెక్టర్



అర్జీలను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 19: ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో స్వీకరించిన అర్జీలను గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు.కాకినాడ కలెక్టరేట్ వివేకానందహాలులో జిల్లాస్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ పరిష్కరించిన అర్జీల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అర్జీల పరిష్కారాల ప్రగతిని ప్రతి శనివారం సమీక్షించాలన్నారు. డీఆర్వో తిప్పేనాయక్, హౌసింగ్ పీడీ సత్యనారాయణ, డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి, కుడా వీసీ కృష్ణమూర్తి, సీపీవో త్రినాథ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు, డీఎల్డీవో నారాయణ పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయానికి 52 అర్జీలు

కాకినాడ క్రైం, ఆగస్టు 19: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ 52మంది నుంచి అర్జీలు, ఫిర్యాదులు, వినతులు స్వీకరించినట్లు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. ఈ సందర్భంగా సమస్యల పరిష్కారంకోసం వచ్చిన అర్జీదారులను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారంకోసం పోలీసు అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఎంజేవీ భాస్కరరావు పాల్గొన్నారు.

మోక్షమెప్పుడో?

కాకినాడ రైతుబజారు



(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

- జిల్లాలో ఏడు కొత్త రైతుబజార్ల ఏర్పాటుకు మోక్షం కలిగేనా
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వీటి నిర్మాణంపై చిగురిస్తోన్న ఆశలు
- ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లిన జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారులు
- జిల్లాలో రూ.5.10కోట్లతో కొత్త బజార్ల నిర్మాణానికి గతంలో అధికారులు ప్రతిపాదనలు
- బజార్లన్నింటికీ స్థలాలు, తక్కువ ధరకు కూరగాయల విక్రయానికి రైతుల ఎంపిక పూర్తి
- తీరా అప్పటి వైసీపీ ప్రభుత్వంపై నమ్మకం లేక టెండర్లకు ముందుకురాని కాంట్రాక్టర్లు
- మూడేళ్లపాటు ఏకంగా పదిసార్లు నిర్మాణ టెండర్లు పిలిచినా స్పందన శూన్యం
- ఇప్పుడు కొత్తసర్కారులో రైతుబజార్లన్నీ అందుబాటులోకి వస్తాయని అధికారుల అంచనా

జిల్లాలో కొత్త రైతుబజార్ల నిర్మాణంపై మళ్లీ ఆశలు గురిస్తున్నాయి. కొత్తగా కూటమి సర్కారు అధికారంలోకి రావడంతో వీటికి పట్టిన గ్రహణం వీడే అవకాశం కనిపిస్తోంది. ఈ మేరకు ప్రభుత్వం దృష్టికి అధికారులు కొత్త బజార్ల ప్రతిపాదనలు తీసుకువెళ్లడంతో మోక్షం కలుగుతుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో వీటి నిర్మాణానికి మార్కెటింగ్‌శాఖ అధికారులు రూ.5.10కోట్లతో అంచనాలు సిద్ధం చేశారు. కొత్తబజార్లలో కూరగాయల విక్రయానికి అన్నదాతల ఎంపిక పూర్తి చేశారు. బజార్లు ఎక్కడ నిర్మించాలనే దానిపై అనువైన స్థలాలు కూడా సేకరించారు. కానీ వీటి నిర్మాణానికి టెండర్లు పిలిస్తే ఒక్కరంటే ఒక్క కాంట్రాక్టర్ కూడా ముందుకు రాలేదు. మూడేళ్లలో పదిసార్లు టెండర్లు పిలిచినా స్పందన లేదు. దీంతో అప్పటి వైసీపీ ప్రభుత్వం పరువు బజారుపాలైంది. ఇప్పుడు కొత్త ప్రభుత్వం రాకతో మోక్షం కలుగుతుందనే ఆశలు అధికారుల్లో వ్యక్తమవుతున్నాయి.

ఎంతమంది ఎదురుచూపులో..

జిల్లావ్యాప్తంగా అనేక పట్టణాల్లో లక్షల్లో జనం నివసిస్తున్నారు. వీరు నిత్యం కూరగాయల కొనుగోల కోసం బయట వ్యాపారులపైనే ఆధారపడుతున్నారు. బయట ధర ఎక్కువ. అయినా తాజావి దొరకని పరిస్థితి. ఈ నేపథ్యంలో ప్రజల అవసరాల కోసం కొత్తగా జిల్లాలో ఏడు రైతుబజార్లు నిర్మించాలని జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారులు 2021లో ప్రతిపాదించారు. వీటికి మూడు నుంచి ఐదెకరాల భూములు కావాలని అంచనాలు వేశారు. వీటి నిర్మాణానికి అంచనాలు తయారుచేసిన ఇంజనీర్లు మొత్తం రూ.7.50కోట్లు ఖర్చవుతుందని తేల్చారు. వీటిలో జగ్గంపేట రైతుబజార్‌కు రూ.67.84లక్షలు, కిర్లంపూడి 58.17లక్షలు, ఏలేశ్వరం రూ.66.36లక్షలు, కాకినాడ ఏటిమొగ రూ.33.38లక్షలు, రమణయ్యపేట రైతుబజార్ 1, 2లకు చెరో రూ.కోటి, తుని బజారుకు రూ.85.61లక్షల చొప్పున ఖర్చవుతుందని అంచనా వేశారు. దీంతో 2021 ఏడాది చివర్లో ప్రభుత్వం టెండర్లు పిలిచింది. పని విలువ లక్షల్లో ఉండడంతో కాంట్రాక్టర్లు పోటీ పడతారని ప్రభుత్వం భావించింది. కానీ దీనికి విరుద్ధంగా గడువు పూర్తయినా ఒక్క కాంట్రాక్టర్ కూడా టెండర్లు దాఖలు చేయడానికి ముందుకు రాలేదు. దీంతో మళ్లీ రెండున్నర నెలల వ్యవధి తర్వాత ప్రభుత్వం ఇంకోసారి టెండర్లు పిలిచింది. కానీ అప్పటి జగన్ ప్రభుత్వంపై నమ్మకం లేని కాంట్రాక్టర్లు అప్పుడు కూడా ఆసక్తి చూపలేదు. ఒకవేళ టెండర్లు దక్కించుకున్నా ప్రభుత్వం డబ్బులు ఇవ్వదనే భయంతో ఒక్కరంటే ఒక్కరు కూడా కన్నెత్తి చూడలేదు. దీంతో ప్రభుత్వం పరువు బజారుపాలయింది. అయినా ఇదేదీ ఖాతరు చేయని సర్కారు ఏకంగా మూడేళ్లలో పదిసార్లు రైతుబజార్ల నిర్మాణ టెండర్లు పిలుస్తూనే వచ్చింది. వరకు అసెంబ్లీ ఎన్నికలకు నాలుగు నెలలు ఉందన్న సమయంలో కూడా కొత్తగా మళ్లీ టెండర్లు పిలిచింది. అయినా స్పందన శూన్యం. దీంతో అప్పటి జగన్ ప్రభుత్వంపై నమ్మకం లేక ఎవరూ ముందుకురాక రైతుబజార్ల నిర్మాణానికి గ్రహణం పట్టినట్లయింది. వాస్తవానికి కాకినాడ జిల్లాకు 15వరకు కొత్త రైతుబజార్ల అవసరం ఉంది. కానీ ఏడు పూర్తయితే ఆ తర్వాత మిగిలినవి పట్టాలెక్కించాలని అధికారులు భావించారు. కానీ జగన్ ప్రభుత్వానికి ఉన్న చెడ్డపేరుతో ఏవీ ముందుకు కదలక ప్రతిపాదలన్నీ కాగితాలకే పరిమితమయ్యాయి.

ప్రస్తుతం మూడు.. కొత్తగా ఏడు..

జిల్లాలో కాకినాడ నగరంలో రెండు, పెద్దాపురంలో ఒకటి రైతుబజార్లు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడు ప్రభుత్వం మారి కొత్తగా కూటమి సర్కారు గద్దెనెక్కడంతో అధికారుల్లోను కొత్తగా ఆశలు గురించాయి. ఇటీవల ప్రభుత్వం దృష్టికి మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధికారులు పాత ప్రతిపాదనలను తీసుకువెళ్లారు. ఏడు కొత్త బజార్ల నిర్మాణానికి స్థలాలు కూడా ఉచితంగా సిద్ధం చేశామని వివరించారు. తాజా కూరగాయలు విక్రయించేలా రైతులను ఎంపిక చేసి ఉంచామని తెలిపారు. టెండర్లు తిరిగి పిలిస్తే ఏడాదిలోగా వీటిని అందుబా టులోకి తీసుకువస్తామని చెప్పారు. ప్రభుత్వ నిర్ణయం కోసం అధికారులు వేచిచూస్తున్నారు. సాధ్యమైనంత వేగంగా వీటికి అనుమతులు వచ్చే అవకాశంఉందని భావిస్తున్నారు.

ప్రజా వినతులను వేగంగా పరిష్కరించాలి

- కలెక్టర్ షాన్‌మోహన్



పిఠాపురంలో ప్రజల సమస్యలు వింటున్న కలెక్టరు షాన్‌మోహన్

పిఠాపురం పట్టణంలోని రథాలపేట సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ మల్టీపర్పస్ కమ్యూనిటీ హాలులో సోమవారం ప్రజాఫిర్యాదులపరిష్కార వేదిక నిర్వహించారు. ట్రైనీ కలెక్టరు హెచ్ఎస్ భావన, కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్‌లతో కలిసి కలెక్టర్ షాన్‌మోహన్ ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. పలువురు వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ అర్జీలు సమర్పించారు.

కిడ్నీలు పాడయ్యాయి.. చికిత్సకు సహకరించరూ..

పెయింటింగ్ వర్కర్‌గా పనిచేస్తున్న తనకు రెండు కిడ్నీలు పాడయ్యాయని విరవాడకు చెందిన బోయి మధు ఆవేదన వ్యక్తం చేశాడు. తన తల్లి కిడ్నీ ఇచ్చేందుకు ముందుకు వచ్చిందని, ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా చికిత్స చేయించుకుందామన్నా అదనంగా రూ.5లక్షల వరకూ వ్యయం అవుతోందని చెబుతున్నారని తెలియజేశాడు. తనకు అంత ఖర్చు భరించే స్తోమత లేదని, తనను ఆదుకోవాలని జిల్లా కలెక్టరుకు విన్నవించాడు.



రెండు కిడ్నీలు పాడయిన విరవాడకు చెందిన పెయింటర్ బోయి మధు

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నివాసంవద్ద జనవాణి

- ఇతర జిల్లాల నుంచి తరలివచ్చిన ప్రజలు

కొమరిగిరి లేఅవుట్ అక్రమాలు నిగ్గుతేల్చాలి



కలెక్టరుకు ఫిర్యాదు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ, మత్స్యకారులు, కొత్తపల్లి మండల నాయకులు

- ద్వారంపూడి అవినీతిపై విజిలెన్స్ విచారణ జరిపించాలి
- మాజీ ఎమ్మెల్యే వర్మ ఆధ్వర్యంలో ఆందోళన
- కలెక్టరుకు ఫిర్యాదు

పిఠాపురం, ఆగస్టు 19: కొమరిగిరి లేఅవుట్ అక్రమాలు నిగ్గు తేల్చాలని, భూసేకరణ, లెవిలింగ్ పేరుతో కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చేసిన అవినీతిపై విజిలెన్స్ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ పిఠాపురం మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఆధ్వర్యంలో మత్స్యకారులు, నాయకులు సోమవారం పిఠాపురం పట్టణంలోని అంబేడ్కర్ కమ్యూనిటీహాలు వద్ద సోమవారం ఆందోళన నిర్వహించారు. అనంతరం ద్వారంపూడి అవినీతి, అక్రమాలపై కలెక్టరు షాన్ మోహన్‌కు ఫిర్యాదు చేశారు.

వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో కాకినాడ నగరవాసుల కోసమంటూ అప్పటి ఎమ్మెల్యే ద్వారంపూడి ప్రోద్బలంతో కొత్తపల్లి మండలం కొమరగిరిలో 350 ఎకరాల భూమిని సేకరించారని వర్మ తెలిపారు. ఇందులో 13వేల పట్టాలుగా లేఅవుట్ చేశారని చెప్పారు. 300నుంచి 400 గృహాలు మాత్రమే కట్టగా, మిగిలిన పట్టాలను బినామీలకు అమ్ముకున్నారని ఆరోపించారు. కొమరిగిరిలో ఉన్న పేదలకు గాని, సముద్రపు కోతవల్ల గృహాలు కోల్పోయిన ఉప్పాడ, మూలపేట, అమీనాబాద్ సహా తీరప్రాంతంలో మత్స్యకారులకుగానీ ఒక్క పట్టా ఇవ్వలేదని తెలిపారు. పిఠాపురం నియోజకవర్గానికి చెందిన వారికి ఒక్కరికి కూడా పట్టాలు ఇవ్వకుండా ద్వారంపూడి అక్రమాలకు పాల్పడ్డారని మండిపడ్డారు. భూసేకరణతోపాటు లేఅవుట్ అభివృద్ధిలోనూ భారీ అవినీతి జరిగిందని ఆరోపించారు. తక్షణం దీనిపై విజిలెన్స్ విచారణ జరిపించాలని కోరారు. ఈ లేవుట్‌లో ఖాళీగా ఉన్న 4వేల పట్టాలను మత్స్యకారులు, కొత్తపల్లి మండలంలోని పేదలకు పట్టాలుగా అందజేయాలని, ద్వారంపూడి బినామీలకు ఇచ్చిన పట్టాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కొమరిగిరి లేఅవుట్ పేరుతో ద్వారంపూడి చేసిన అవినీతి, అక్రమాలు గురించి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు వివరించడంతోపాటు సమగ్ర వివరాలతో ఫైల్ అందిస్తామన్నారు. టీడీపీ హయాంలో పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకుగాను సెజ్‌లో 80 ఎకరాలు భూమిని డీనోటిఫై చేసి ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ఆందోళనలో మత్స్యకారులు, కొత్తపల్లి మండలానికి చెందిన నాయకులు, పిఠాపురం మునిసిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పారిశ్రామికంగా జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలి

- పారిశ్రామికవేత్తల సమావేశంలో కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 19: పారిశ్రామికంగా జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేందుకు అవసరమైన చర్యలు చేపడతామని కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. 2024-29 కొత్త పారిశ్రామిక పాలసీ రూపకల్పన నిమిత్తం సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని వివిధ రకాల పారిశ్రామికవేత్తలు, ఇండస్ట్రియల్ యూనియన్ల అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, నిబంధనలను క్రమబద్ధీకరించడం, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ పాలసీ 2024-29 ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ రూపకల్పన చేపట్టిందన్నారు. 2018 నుంచి పరిశ్రమలకు అందించే విద్యుత్ సబ్సిడీ పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని విడుదల చేయాలన్నారు. పూణే మోడల్ తరహాలో కాకినాడ ఇండస్ట్రియల్‌లో అవలంబిస్తే పారిశ్రామికవేత్తలకు లబ్ధి చేకూరతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న ఇండస్ట్రియల్ పార్కులకు సంబంధించి కాకినాడకు ఒక పార్కు కేటాయించి తగిన వసతులు కల్పిస్తే పారిశ్రామికవేత్తలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమశాఖ ఏడీ కృష్ణార్జునరావు, ఏపీఐఐసీ జేడ్ఎం రమణారెడ్డి, డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాధాకృష్ణ, ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఉదయ్ భాస్కర్, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి సురేంద్ర ఆనంద్ పాల్గొన్నారు.

గ్రామసభలతోనే.. గ్రామాల అభివృద్ధి

- ఈనెల 23న గ్రామసభలు
- ఉపాధి, అభివృద్ధి పనులకు ప్రణాళికలు
- గ్రామసభల్లో పనుల గుర్తింపు
- సర్పంచ్ అధ్యక్షతన సభలు

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 19: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ కాంపోనెంట్‌తో అభివృద్ధి పనులకు ప్రణాళిక తయారు చేయడానికి గ్రామసభలను నిర్వహించాలని అక్కడే గ్రామ అవసరాలను ప్రకారం అభివృద్ధి పనులు గుర్తించి ప్రణాళిక సిద్ధం చేయాలని నిర్ణయించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 1012 గ్రామ పంచాయతీల్లో ఈనెల 23న గ్రామసభలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

గ్రామసభల్లో పనుల గుర్తింపు

కాకినాడ జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.112కోట్లతో మెటీరియల్ కాంపోనెంట్‌తో సీసీ రహదారులు, సీసీ డ్రైన్లతోపాటు ఇతర అభివృద్ధి పనులు చేయాలని నిర్ణయించారు. ఆయా గ్రామ సభలకు సర్పంచ్ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి నేతృత్వం వహించాల్సి ఉంది. ఈ సభలకు ఉపాధి హామీ వేతనదారులు, గ్రామపెద్దలు, యువకులు, మహిళలు, డ్వాక్రా సభ్యులు హాజరై ఆయా గ్రామాల్లో కావాల్సిన అవసరాలను గుర్తించాల్సి ఉంది. అవసరమైతే బీటీ రహదారులు ఈ మెటీరియల్ కాంపోనెంట్‌తో చేసే అవకాశాలున్నాయి. రైతులకు అవసరమైన పంత రహదారులు, పాఠశాలలకు ప్రహరీలు, ఉద్యాన రైతులకు సంబంధించి ప్రోత్సాహకాలు, పశువులు, మేకలకు సంబంధించి షెడ్లు ఏర్పాటు, రైతులు తమపంట చేలల్లో భూగర్భ జలాలు వృద్ధి చెందడానికి వర్షపునీరు వృథా పోకుండా గట్ల వెంబడి కందకాల ఏర్పాటు, చెరువుల్లో పూడికతీత పనులు, గట్ల వెంబడి కొబ్బరి, టేకు వంటి మొక్కలు ఏర్పాటు చేసుకోవడం, పండ్ల తోటల్లో రింగ్ ట్రెంచ్ల ఏర్పాటుకు ఈ నిధులు మంజూరు చేస్తారు. గుర్తించిన పనులను ఉపాధి హామీ శాఖ ఏర్పాటు చేసిన బ్లూఫ్రాగ్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. గ్రామాల అభివృద్ధి కోసం ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ కాంపోనెంట్ నిధులు వినియోగించనున్నారు. ఇప్పటికే జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో పశుసంవర్ధకశాఖతో కలిసి ఉపాధి పథకంలో 675 యూనిట్లను పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల షెల్టర్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు.

జిల్లాలో 69 లక్షల పనిదినాలు లక్ష్యం

ఈ ఆర్థిక సంవత్సరంలో 69 లక్షల పనిదినాల లక్ష్యంగా 2,79,000 లక్షలు ఉపాధి హామీ కూలీలు ఉన్నారు. డ్వామా శాఖ నివేదికలు చెపుతున్నాయి. మెటీరియల్ రూ.112 కోట్లకుగాను రూ.16.05కోట్లు మెటీరియల్ రూపంలో చెల్లించారు. ఒక్కొక్క కుటుంబానికి సరాసరి 39 పనిదినాలు కల్పించి సరాసరి రూ.248 తలసరివేతనంగా అందించారు. పండ్ల తోటల పెంపకంలో 2400 ఎకరాలు లక్ష్యంగా నిర్దేశించుకోగా ఇప్పటికి 650ఎకరాల్లో లబ్ధిదారులను గుర్తించి అంచనాలు వేసి మొక్కలు నాటే కార్యక్రమం జరుగుతోంది.

కమ్యూనిటీ సోక్‌పిట్ నిర్మాణం

గ్రామాల్లో మురుగునీరు నీటి కాల్వ నిర్మాణం చేయడానికి అవకాశంలేని ప్రదేశాల్లో కమ్యూనిటీ సోక్‌పిట్ నిర్మాణం చేయడంవల్ల పారిశుధ్యం మెరుగుపడుతుందని చెపుతున్నారు. పంచాయతీ స్థలాన్ని గుర్తించి ఈ నిర్మాణం చేపట్టడానికి ఉపాధి నిధులను కేటాయిస్తారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 389 గ్రామాలకుగాను 103 కమ్యూనిటీ సోక్‌పిట్ నిర్మాణాలు ప్రారంభమై ప్రగతిలో ఉన్నాయని డ్వామా శాఖాధికారులు చెపుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సరైన డ్రైనేజీ వ్యవస్థలేని చోట్ల పారిశుధ్యం మెరుగుపరచడానికి రూ.5వేలతో వ్యక్తిగత ఇంకుడు గుంత నిర్మాణాలకు నిధులు కేటాయించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 440 మాజిక్‌సోక్‌పిట్లకు గాను 61 ప్రగతిలో ఉన్నాయని చెపుతున్నారు.

24 గంటలూ నిఘా

- కాకినాడ పోర్టులో 4748 లారీలు తనిఖీలు
- జాప్యం కాకుండా రెండు చెక్‌పోస్టులు

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 19: కాకినాడ పోర్టులో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై 24గంటలూ నిఘాపెట్టారు. ఒక్క లారీను కూడా వదలిపెట్టకుండా అన్నింటినీ క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఒకటో చెక్‌పోస్టు బొంబాయి కాటా వద్ద ఏర్పాటు చేశారు. రెండో చెక్‌పోస్టు ఎంఎంటీసీ శక్తి గేటువద్ద ఏర్పాటు చేశారు. ఈ రెండు చెక్‌పోస్టులవద్ద ప్రభుత్వ అధికారులు మూడు షిఫ్ట్‌ల్లో పనిచేస్తూ పీడీఎస్ బియ్యం అక్రమ రవాణపై పటిష్టమైన నిఘా ఉంచారు. బ్రోకెన్ రైస్, రా రైస్, బాయిల్డ్ రైస్‌లను పరిశీలిస్తున్నారు. ఏదైనా అనమానం వస్తే శాంపిల్ తీసి పౌరసరఫరాలశాఖ ల్యాబ్‌కు పరీక్ష నిమిత్తం పంపిస్తున్నారు. ఈనెల 5 నుంచి చెక్‌పోస్టులు పనిచేస్తున్నాయి. ఇప్పటివరకు రెండువారాల వ్యవధిలో 4748 లారీలను, 441 రైల్వే వ్యాగన్లను అధికారులు తనిఖీ చేసి శాంపిల్స్ తీశారు.

రూ.90కోట్ల బ్యాంకు గ్యారెంటీతో విడుదలకు సిద్ధం

జూన్, జూలై నెలల్లో చేసిన దాడుల్లో 26,488 మెట్రిక్ టన్నుల కెర్నెల్స్ కలిగిన ఫోర్టిఫైడ్ పీడీఎస్ బియ్యాన్ని అధికారులు సీజ్‌చేశారు. 13మందిపై 6ఏ కేసులు నమోదు చేశారు. క్రిమినల్ కేసులు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ 26,488 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని రూ.90కోట్ల బ్యాంకు గ్యారెంటీతో తిరిగి వారికి ఇచ్చేందుకు అధికారులు మెమో ఇచ్చారు. 13మంది గొడౌన్ల యాజమాన్యం బ్యాంకు గ్యారెంటీ ద్వారా బియ్యం తిరిగివారికి ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పీడీఎస్ బియ్యం రవాణాపై దాడులు

క్షేత్రస్థాయిలో పీడీఎస్ బియ్యం సేకరించి మిల్లర్లకు సరఫరా చేస్తున్న వారిపై దాడులు చేస్తున్నామని జిల్లా పౌరసరఫరాల అధికారి ఎంవీ ప్రసాద్ తెలిపారు. దీనికి ప్రత్యేకంగా బృందాలు నిరంతరం పర్యవేక్షిస్తున్నాయన్నారు. పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తే తమకు సమాచారమివ్వాలన్నారు.

అక్రమ తరలింపునకు అడ్డుకట్ట వేయాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ),ఆగస్టు 19: కాకినాడపోర్టులో అక్రమ బియ్యం తరలింపు నియంత్రించడంలో చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది అత్యంత కీలకమైన పాత్ర పోషించాలని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. కాకినాడపోర్టు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌వద్ద విధులు నిర్వహిస్తున్న సీఎస్డీటీలు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్స్, వీర్వోలు, టెక్నికల్ సిబ్బందితో సోమవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో ట్రైనీ కలెక్టర్ భావన, పౌరసరఫరాలు, పోలీసు, పోర్టు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ పోర్టుకు సంబంధించి నిత్యం ఇతరదేశాలకు వివిధ రకాల ఎగుమతులు జరుగుతుంటాయని, వీటిలో బియ్యం ఎగుమతులను అరికట్టే చర్యల్లో భాగంగా బొంబాయి కాట, శక్తి గేట్ వద్ద రెండు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. జిల్లా పౌరసరఫరాల సంస్థ అధికారి ప్రసాద్, డీఎం బాలసరస్వతి, ఆర్డీవో కిషోర్, పోర్టు అధికారి ధర్మశాస్త్ర పాల్గొన్నారు.



అవినీటి..పారుదల!?

- ఇరిగేషన్ శాఖలో గత ఐదేళ్లుగా ఇంతే
- అదనపు బాధ్యతలతో దోపిడీ
- అందరూ అదనపు చార్జ్‌లే
- వీరిలో డెల్టా సీఈ నుంచి ఎస్ఈ, డివిజన్ ఈఈలు
- ఎవరికి వారే అన్నచందంగా డివిజన్ల తీరు
- పదవీ విరమణ చేయించాల్సిన ఎన్ఎంఆర్ ఉద్యోగికి 8 నెలలుగా జీతం
- పట్టించుకోని హెడ్‌వర్క్స్ ఈఈ, ఎస్ఈకి ఫిర్యాదు అందడంతో వెలుగులోకి

ధవళేశ్వరం, ఆగస్టు19: కలెక్టరమ్మా కాస్త ఇటు చూడమ్మా.. ధవళేశ్వరం నీటి పారుదలశాఖపై దృష్టి పెట్టమ్మా.. అక్కడ జరిగే దారుణాలు అన్నీ ఇన్నీ కావు.. బ్రిటీష్ వాళ్ల నిర్మించిన భవనాలమాటున ఎన్నో అకృత్యాలు సాగుతున్నాయి. కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉన్నా నేటికీ మార్పు లేదు.. అధికారులకు నచ్చినచోట.. ఇష్టం వచ్చినట్టు దోచుకుంటూ అవినీటి పారుదల శాఖగా మార్చేశారు. దీనిలో భాగంగా సొమ్ములు వచ్చే సీట్లను ఎంచుకుని ధవళేశ్వరం నీటి పారుదలశాఖలో అడిషనల్ చార్జిలుగా కొన సాగుతున్నారు. ఒక్కసారి లెక్క తీస్తే గత ప్రభుత్వ హయాంలో మంత్రులను, ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకుని అదనపు ఆదాయానికి అదనపు సీటులో కూర్చున్న వారే అధికం. డెల్టా సీఈ నుంచి ఎస్ఈ, డివిజన్ ఈఈలు అందరూ అదనపు చార్జ్‌లతో కొనసాగుతున్నవారే. తూర్పు డెల్టా, మధ్యడెల్టా వైఐ డివిజన్లతోపాటు సర్కిల్ కార్యాలయంలోని డిప్యూటీ ఎస్ఈ, ఆఫీసర్ అండ్ టెక్నికల్ (ఓటీ)వంటి పోస్టుల్లో ఉన్న ఉద్యోగులందరూ అదనపు బాధ్యతలు చేపట్టినవారే. అదనపు బాధ్యతలను బాధ్యతాయుతంగా నిర్వర్తించాల్సిన అధికారులు ఆయా డివిజన్లను పూర్తిస్థాయిలో పట్టించుకోకుండా కాసులు వచ్చే పనులపైనే దృష్టి సారిస్తున్నారు. దీంతో ఆయా శాఖల ఉద్యోగులు కూడా సమయపాలన పాటించకపోవడం, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలు నిజం చేస్తున్న సంఘటనలు బయటపడుతున్నాయి. దానికి ఈ కింద సంఘటనే ఉదాహరణ.

ఎస్ఈకి ఫిర్యాదు చేయడంతో వెలుగులోకి

సదరు ఎన్ఎంఆర్ ఉద్యోగి విషయంలో ఉద్యోగ విరమణ చేయించకుండా సొమ్ములు తీసుకుని రికార్డుల్లో వయసు మార్చి ఉద్యోగంలో కొనసాగిస్తూ 8 నెలలుగా జీతం చెల్లిస్తున్నారని సర్కిల్ ఎస్ఈకి ఫిర్యాదు అందడంతో హెడ్‌వర్క్స్ ఈఈని వివరణ కోరారు. రికార్డులు పరిశీలించి 2023 మేలోనే సదరు ఉద్యోగిని విరమణ చేయించాల్సి ఉందని గుర్తించారు. నిబంధనల మేరకు ప్రస్తుతం ఉద్యోగ విరమణ చేయించినా ఉద్యోగ విరమణ తరువాత అతడికి ప్రభుత్వం నుంచి వచ్చే గ్రాట్యుటీ, పింఛన్ వంటివి ఉండకపోవడంతో గత 8 నెలలుగా ప్రభుత్వ ఖజానా నుంచి చెల్లించిన జీతం ఏ విధంగా రాబట్టాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. వీరి నిర్లక్ష్యానికి చెల్లించిన జీతం హెడ్‌వర్క్స్ డివిజన్‌లోని సంబంధిత ఉద్యోగుల నుంచి రాబట్టాలా, లేక డివిజన్ ఈఈ భరిస్తారా లేకుంటే మసిపూసి మారేడుకాయ చేస్తారనేది సర్కిల్ ఎస్ఈకే తెలియాలి.

పదవీ విరమణ చేయాల్సిన ఉద్యోగికి 8 నెలలుగా జీతం

2010వ సంవత్సరంలో కొందరు ఎన్ఎంఆర్ ఉద్యోగులుగా కోర్టు ఆర్డరుతో హెడ్ వర్క్స్ డివిజన్‌లో విధుల్లో చేరారు. ఆ సమయంలో తమ వయసును నిర్ధారించే పత్రాలు అందజేశారు. వారిలో కొందరి వయసు నిండడంతో 2023 మే, జూన్‌లలో ఉద్యోగ విరమణ చేశారు. అప్పట్లోనే ఉద్యోగ విరమణ చేయాల్సిన వ్యక్తి హెడ్ వర్క్స్ సెక్షన్‌లో కాటన్ మ్యూజియంలో విధులు నిర్వహిస్తూ గత 8 నెలలుగా ఎటువంటి ఆటంకం లేకుండా జీతం పొందుతున్నాడు. హెడ్‌వర్క్స్ ఈఈ నిర్లక్ష్య వైఖరితోపాటు సంబంధిత సెక్షన్ ఉద్యోగులు పట్టించుకోకపోవడంతోనే ఉద్యోగ విరమణ చేయించాల్సిన వ్యక్తికి 8 నెలలుగా జీతం చెల్లిస్తున్నారని ఉద్యోగ వర్గాల్లోనే విమర్శలు వినిపిస్తున్నాయి




శ్రీపాదశ్రీవల్లభుడికి, ఔదంబర వృక్షానికి రాఖీ కడుతున్న భక్తులు

దత్తక్షేత్రాలకు పోటెత్తిన భక్తులు

- పిఠాపురంలో ఆలయాలకు శ్రావణి(రాఖీ)పౌర్ణమి శోభ
- శ్రీపాదుడు, ఔదంబర వృక్షానికి రాఖీదారణ



ప్రత్యేక అలంకారంలో శ్రీపాదశ్రీవల్లభుడు

పిఠాపురం, ఆగస్టు 19: దత్తక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకూ ఆలయాలు, రహదారులు భక్తజనంతో కిటకిటలాడాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీపాదుడు, ఔదంబర వృక్షాలకు భక్తులు రాఖీలు కట్టారు. పిఠాపురంలోని దత్తక్షేత్రాలకు సోమవారం శ్రావణ పౌర్ణమి శోభ చేకూరింది. శ్రావణ(రాఖీ లేదా జంద్యాల) పౌర్ణమిని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీపాదవల్లభ మహా సంస్థానంలో శ్రీపాదశ్రీవల్లభుడిని ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ రకాల పుష్పాలతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మహారాష్ట్ర, కర్నాటక, గుజరాత్, ఉత్తరప్రదేశ్, ఒరిస్సా, పశ్చిబెంగాల్‌తోపాటు ఉభయ తెలుగురాష్ట్రాలు, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పూజల్లో పాల్గొన్నారు. ఆలయ పరిసరాలన్ని భక్తజనసంద్రమయ్యాయి. శ్రీపాదశ్రీవల్లభస్వామికి మహిళలచే రాఖీదారణ జరిగింది. దత్త స్వరూపంగా భావించే ఔదంబర వృక్షానికి రాఖీలు కట్టారు. వాసవీకన్యకా పరమేశ్వరి అమ్మవారు శ్రీపాదశ్రీవల్లభులకు రాఖీ కట్టిన పవిత్రదినం కావడంతో మహిళా భక్తులు రాఖీ కట్టేందుకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. స్వామికి మహాన్యాసపూర్వక శతరుద్రాభిషేకం, హోమం, అభిషేకాలు జరిగాయి. భక్తులకు అన్నప్రసాదాలు అందించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సౌజన్య ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రాఖీ ఆనందం క్షణాల్లో ఆవిరి!?

- అమ్మను కబళించిన మృత్యువు



సంఘటనా స్థలంలో క్షతగాత్రులు





ప్రమాదంలో మృతిచెందిన సత్యవేణి



లారీ డ్రైవర్‌ను కట్టేసిన దృశ్యం

రాజమహేంద్రవరం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రాఖీ పండుగ ఆ కుటుంబంలో అంతులేని శోకాన్ని మిగిల్చింది. కూతురిని తీసుకొని కొడుకు వద్దకు వెళ్లి రాఖీ కట్టించిన ఆనందం క్షణాల్లో ఆవిరైంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా కొత్తపేటలోని సంతోష్‌నగర్‌కి చెందిన కనకాల అమ్మిరాజు, సత్యవేణి దంపతులకు ఇద్దరు పిల్లలు. కొడుకు శ్రీరామ్ రాజమహేంద్రవరం శివారు కాతేరులోని తిరుమల కళాశాలలో జూనియర్ ఇంటర్ చదువుతున్నాడు. సోమవారం రాఖీ పౌర్ణమి కావడంతో కూతురు వైష్ణవి, అన్నయ్య గుర్రాల దుర్గారావుతో కలిసి తిరుమల కళాశాలకు వెళ్లారు. తమ్ముడు శ్రీరామ్‌కి వైష్ణవి రాఖీ కట్టింది. అందరూ కలిసి భోజనం చేసి కాసేపు ఆనందంగా గడిపారు. మధ్యాహ్నం 3.30సమయంలో తిరుగు ప్రయాణమయ్యారు. కళాశాలకు కొద్ది దూరంలో వంతెనపై వెళ్తుండగా ఒడిశా నుంచి పేపర్ మిల్లుకు కర్రల లోడుతో వస్తున్న వ్యాను వీరి బైక్‌ని బలంగా ఢీకొంది. వ్యాన్ డ్రైవరు చబుద్రప్రధాన్ తాగిన మైకంలో దారి తప్పడంతో పేపర్‌మిల్లు దాటిపోయి సుమారు 3 కిలోమీటర్లకుపైగా వెళ్లిపోయాడు. అదే సమయంలో రాజమహేంద్రవరం వైపు ఆ ముగ్గురూ బైక్‌పై వస్తున్నారు. వంతెన పైకి రాగానే కుడివైపు వెళ్తున్న వ్యాన్‌ని మద్యం మత్తులో ఎడమ వైపునకు అకస్మాత్తుగా తిప్పడంతో బైక్‌ని బలంగా ఢీకొంది. దీంతో బైక్ వెనుక చివరన కూర్చున సత్యవేణి వెనక్కి పడిపోవడంతో తలకు వంతెన సిమెంటు ప్లాట్‌ఫాం బలంగా తగిలి తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందింది. వైష్ణవి, దుర్గారావుకు తీవ్రంగా గాయాలయ్యాయి. వారిని తొలుత ప్రభుత్వాస్పత్రికి తరలించి మెరుగైన చికిత్స కోసం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. సంఘటన జరిగిన తర్వాత స్థానికులు పరుగుపరుగున అక్కడికి చేరుకున్నారు. వారిలో ఒకరు 108కి ఫోన్ చేశారు. అయితే ధవళేశ్వరం నుంచి వచ్చే వాహనం లేదని.. రాజానగరం నుంచి పంపిస్తామని చెప్పారు. ఫోన్‌లు చేసినా ఫలితం లేదు. ఈలోపు ఆటోలో ఆస్పత్రికి తరలించడానికి సన్నద్ధమవుతుండగా.. అరగంట దాటిన తర్వాత 108 వచ్చింది. అప్పటికే వైష్ణవి తలకు బలమైన గాయం కావడంతో రక్తమోడుతూ దాదాపుగా స్పృహ కోల్పోయింది. దీంతో స్థానికులు 108పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ వాహనం ఆలస్యం వల్లనే వైష్ణవి పరిస్థితి విషమంగా మారిందని ఆవేదన చెందారు. వ్యాన్ డ్రైవర్ చబుద్రప్రధాన్ నిర్లక్ష్యమని ప్రాథమికంగా గుర్తించి అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని సీఐ అప్పారావు తెలిపారు.

'ఆదిత్య'లో వృక్షాబంధన్



చెట్టుకు రాఖీ కడుతున్న దృశ్యం

గండేపల్లి, ఆగస్టు 19: కాకినాడ జిల్లా గండేపల్లి మండలం సూరంపాలెంలో ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో హరిత ఎకో క్లబ్ వారు వృక్షాబంధన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవిశంకర్ మాట్లాడుతూ ప్రతీఒక్కరూ ఒక వృక్షాన్ని దత్తత తీసుకుని ఆ వృక్షాన్ని కాపాడడం, కొత్తగా మొక్కలు నాటడం వంటివి చేయడం ద్వారా ప్రకృతిని కాపాడుకోవాలన్నారు. అనంతరం కాలేజీ ఆవరణలో, వెంకటాపురం గ్రామంలో జడ్పీ హైస్కూల్ నందు పిల్లలతో చెట్టుకు రక్షాబంధం కట్టించారు.

రాఖీ కట్టిన అక్కకు తమ్ముడు డైమండ్ చెవి దిద్దులు కానుక



పేరవరంలో అక్కకు డైమాండ్ రింగ్‌ను బహూకరిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, ఆగస్టు 19: ఆత్రేయపురం మండలం పేరవరానికి చెందిన దాసరి సూర్యతేజ రాఖీ పౌర్ణమి సందర్భంగా తన అక్క కావ్యకు ఖరీదైన బహుమతి ఇచ్చాడు. ఇంజనీరింగ్ పూర్తిచేసి ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్న సూర్యతేజ సోమవారం హైదరాబాద్‌లో ఉంటున్న తన అక్క కావ్య దగ్గరకు వెళ్లి రాఖీ కట్టించుకుని అనంతరం సుమారు రూ.లక్షా 30 వేలు విలువచేసే డైమండ్ చెవి దిద్దులను కానుకగా ఇచ్చాడు. తమ్ముడు బహుమతినిచూసి అక్క ఆనందానికి అవధులులేవు. తమ్ముడికి కావ్య రూ.14వేల వాచీని బహుమతిగా ఇచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి వీసీ మురళీకృష్ణ

నేడు జేఎన్టీయూకే

16వ ఆవిర్భావ దినోత్సవం

- ముఖ్యఅతిథిగా హాజరుకానున్న ఏపీఎస్సీహెచ్ఈ ఇన్‌చార్జి చైర్మన్ రామ్మోహన్‌రావు
- కృష్ణతేజ, రామకృష్ణలకు యంగ్ అచీవర్స్ అవార్డుల ప్రదానం

జేఎన్టీయూకే, ఆగస్టు19: కాకినాడ జేఎన్టీయూకే 16వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి వీసీ కేవీఎస్జీ మురళీకృష్ణ తెలిపారు. వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై సోమవారం వర్సిటీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఇన్‌ఛార్జి చైర్మన్ కె.రామ్మోహన్‌రావు, గౌరవఅతిథిగా కాకినాడ సీపోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీవోవో మెర్ల మురళీధర్ పాల్గొంటున్నారన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరచిన వర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులకు అవార్డులను అందజేస్తామని తెలిపారు. ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ డైరెక్టర్, డిప్యూటీ సీఎం ఓఎస్డీ ఎంవీఆర్ కృష్ణతేజ, ప్రొవిజన్స్ లాజిస్టిక్స్ ఐజీ పీహెచ్‌డీ రామకృష్ణలకు యంగ్ అచీవర్స్ అవార్డులను ప్రదానం చేయనున్నామన్నారు. ఈ వేడుకలకు మాజీ ఉపకులపతులు, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి అధికారులు, పూర్వవిద్యార్థులను ఆహ్వానించామని తెలిపారు. సమావేశంలో రెక్టార్ కేవీ రమణ, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

జగ్గంపేట జగనన్న కాలనీలో ఇద్దరు అనుమానాస్పద మృతి

- కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు



జగ్గంపేటలో ఒకే గదిలో ఇద్దరు ఉరేసుకుని మృతి చెందిన దృశ్యం

జగ్గంపేట, ఆగస్టు 19: కాకినాడ జిల్లా జగ్గంపేట జగనన్న కాలనీలో సోమవారం సాయంత్రం ఇద్దరు ఉరేసుకుని మృతిచెందిన సంఘటన జరిగింది. జగ్గంపేట పోలీసులకు సమాచారం రావడంతో ఎస్ఐ రఘునాధరావు, ఏఎస్ఐ నూకరాజు సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం... గత మూడేళ్లుగా జగనన్నకాలనీలో ఒక ఇల్లు అద్దెకి తీసుకుని రంగంపేటకు చెందిన వివాహిత అన్నాబత్తుల ప్రసన్న అద్దెకు ఉంటుంది. అదే విధంగా జగ్గంపేటకు చెందిన యువకుడు నాని (25) ఆమెతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఇద్దరి మధ్య కలహాలు రావడంతో సోమవారం సాయంత్రం ఆమె ఉరేసుకోగా అది చూసి తట్టుకోలేక అతను కూడా ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు స్థానికులు తెలియజేశారు. దీనిపై ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పవన్ నివాసం వద్ద జనవాణి

- జిల్లాలు నుంచి తరలివచ్చిన ప్రజలు



జనవాణి కార్యక్రమంలో వినతులు ఇచ్చేందుకు వచ్చిన ప్రజలు

గొల్లప్రోలురూరల్, ఆగస్టు 19: కాకినాడజిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు బైపాస్‌రోడ్డులోని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసం వద్ద సోమవారం జనవాణి కార్యక్రమం నిర్వహించారు. జనవాణిలో తమ సమస్యలు విన్నవించుకునేందుకు పిఠాపురం నియోజకవర్గంతో పాటు వివిధ జిల్లాలు నుంచి ప్రజలు తరలివచ్చారు. అక్కడ ప్రత్యేకంగా నియమించిన సిబ్బంది వారి సమస్యలు తెలుసుకుని వినతులు స్వీకరించారు. వీటిని పరిష్కారం నిమిత్తం డిప్యూటీ సీఎం కార్యాలయం ద్వారా ఆయా శాఖల అధికారులకు పంపనున్నారు. వ్యక్తిగత, సామాజిక సమస్యలతో పాటు అర్హతఉన్నా పింఛన్లు అందకపోవడం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోసం, వైద్య సహాయంఅంశాల్లో ఎక్కువగా వినతులు వచ్చాయి. తన ఇంటిని నాలుగు సంవత్సరాల క్రితం అద్దెకు ఇచ్చానని, వారు అద్దె ఇవ్వకపోగా తనను ఇంటి నుంచి గెంటి వేశారని మచిలీపట్టణంలోని నిజాంపేట ప్రాంతానికి చెందిన మహిళ కేదారేశ్వరీ జనవాణిలో ఫిర్యాదు చేసింది. అప్పటి వైసీపీ ప్రభుత్వం, పోలీసుల అండ చూసుకుని ఇంటి నుంచి గెంటివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పలుమార్లు పోలీసులకు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా తనకు న్యాయం చేయకపోగా, తనకు మానసికస్థితి సరిగాలేదంటూ ముద్రవేశారని తెలిపారు. తనకు న్యాయం చేయాలని విన్నవించారు. పవన్‌కల్యాణ్‌కు సమస్య విన్నవించుకుంటే సమస్య పరిష్కారమవుతుందని చెప్పారని,అందుకే ఇక్కడకు వచ్చినట్లు చెప్పారు.

అమెరికా హానర్‌కు ఫొటోగ్రాఫర్ అభిరామ్ ఎంపిక

రాజానగరం, ఆగస్టు 19: వరల్డ్ ఫొటోగ్రఫీ డే సందర్భంగా ఇమేజ్ కొలీగ్ సొసైటీ అమెరికా(ఐసీఎస్) ఈ ఏడాది ప్రపంచ వ్యాప్తంగా 28 మంది ఫొటో గ్రాఫర్లకు గౌరవ హానర్‌లు ప్రకటించి ందని, దీనిలో మన దేశం నుంచి 11మందికి గానూ, తెలుగు రాష్ట్రాలకు చెందిన వారిలో తెలంగాణ నుంచి నలుగురు, ఆంధ్రప్రదేశ్ నుంచి హానర్‌కు తనను ఎంపిక చేసినట్టు ఫొటో గ్రాఫర్ అభిరామ్ తెలిపారు. రాజానగరం మండలం కొత్తతుంగ పాడు గ్రామానికి చెందిన గొల్లపల్లి అభిరామ్ చదువుకునే రోజుల్లో ఫొటోగ్రఫీపై ఉన్న మక్కువతో తొలిసారిగా 1998లో ఫొటోగ్రఫీ వృత్తిలోకి ప్రవేశించాడు. అప్పటి నుంచి నేటి వరకు వివిధ ఫొటోగ్రఫీ వర్క్‌షాప్‌లలో పాల్గొని 42 ఫొటోగ్రఫీ అవార్డులు సాధించినట్టు చెప్పారు. హానర్ రావడానికి సహకరించిన పటాన్ హుస్సేన్‌ఖాన్, తుమ్మా శ్రీనివాస్‌రెడ్డి, సమీర్ మధుకర్ మోహితేకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు డిసెంబర్ 1న విజయవాడ బాలోస్వాప్ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రఫీ అకాడమీ ఆధ్వర్యంలో హానర్ అందుకోనున్నట్టు అభిరామ్ తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఫొటోగ్రాఫర్లు ఆయనకు అభినందనలు తెలియజేశారు.



అవార్డులు తెచ్చిపెట్టిన అభిరామ్ అపురూప చిత్రం

విద్యుదాఘాతంతో టిప్పర్ డ్రైవర్ మృతి

- కోలమూరులో గ్రావెల్ అన్‌లోడ్ చేస్తుండగా ఘటన


రాజానగరం, ఆగస్టు 19: రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలో కొంతమూరులోని ఎస్‌వీబీ లేఅవుట్‌లో విద్యుదాఘాతంతో టిప్పర్ డ్రైవర్ మృతి చెందినట్టు రాజానగరం సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్ సోమవారం తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం మలకపల్లికి చెందిన కొక్కిరిపాటి రాజు(55) గౌరీపట్నం క్వారీ నుంచి గ్రావెల్ లోడు చేసుకుని రాజమహేంద్రవరం రూరల్ మండలం కోలమూరు చేరుకున్నాడు. స్థానిక ఎస్‌వీబీ లేఅవుట్‌లో ఆదివారంరాత్రి 7.30 సమయంలో గ్రావెల్ అన్‌లోడ్ చేస్తుండగా పైనున్న విద్యుత్ తీగలు తగలడంతో షాక్‌కు గురై డ్రైవర్ రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశామన్నారు. మృతుడి అల్లుడు ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలేనికి చెందిన ఉండ్రాజవరపు పాపారావు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

తునిరూరల్, ఆగస్టు 19: 16వనెంబరు జాతీయ రహదారిపై రోడ్డుప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాకినాడ జిల్లా తుని మండలం తేటగుంట శివారు ఎర్రకోనేరులో జరిగింది. ఎర్రకోనేరు జంక్షన్‌లో ఓ హోటల్ఎదురుగా రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న సుమారు 35ఏళ్ల వయస్సుగల వ్యక్తిని తుని నుంచి అన్నవరం వైపుగా వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి.స్థానికుల సమాచారంతో రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికిచేరుకుని ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. మెరుగైన వైద్యంకోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించే సమయంలో వ్యక్తిప్రాణాలు వదిలాడు. మృతుడి వివరాలు కానరాకపోవడంతో మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రిలో ఉంచారు. మృతుడి బంధువులు రూరల్ పోలీసులను సంప్రదించాలన్నారు.

కారులో గంజాయి రవాణా

- 25 కిలోలు స్వాధీనం.. ఏడుగురి అరెస్టు
- చోరీ కేసుల్లోని రూ.11,81,000 విలువైన సొత్తు రికవరీ



గంజాయి స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

కొవ్వూరు, ఆగస్టు 19: గంజాయి రవాణాచేస్తున్న ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి 25.130కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు సీఐ పి.విశ్వం తెలిపారు. సోమవారం కొవ్వూరు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీసులకు అందిన సమాచారం మేరకు సోమవారం ఎస్ఐ కె.జగన్మోహన్, లీగల్ మెట్రాలజీ అధికారులు, రెవెన్యూ సిబ్బందితో వాహన తనిఖీలు చేపట్టారు. కొవ్వూరు టోల్‌గేట్ సమీపంలో సర్వీస్‌రోడ్‌లో మారుతి కారు అనుమానాస్పదంగా వస్తుండడంతో ఆపి తనిఖీ చేశారు. కొవ్వూరు కోట్ల వారి వీధికి చెందిన రౌడీషీటర్ కంచుబాణి దినకర్, ఇందిరమ్మకాలనీకి చెందిన భూపతి అశోక్, భూపతి అశ్వర్థ, దొమ్మేరు సావరం గ్రామానికి చెందిన కడింపల్లి సిద్ధార్థ, దేవరపల్లి మండలం యర్నగూడెం పాతపేటకు చెందిన గీసాల రవికుమార్, కొరివేటి పోసికుమార్, పోలవరం హైస్కూల్ రోడ్డుకు చెందిన చెట్టేబత్తుల హర్షవర్ధన్‌లు అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల గ్రామంలో కొనుగోలు చేసి కారులో రెండు బ్యాగ్‌లుగా పార్సిల్ చేసి తీసుకువస్తున్న 25.130 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. దీని విలువ రూ.75 వేలు ఉంటుందన్నారు. దీనిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చి విచారణ చేపట్టామన్నారు. ఈ విచారణ అనంతరం కొవ్వూరు, రాజానగరం, దేవరపల్లి పోలీసుస్టేషన్ల పరిధిలో జరిగిన ఐదు దొంగతనాలకు సంబంధించిన ఆస్తిని రికవరీ చేశామని సీఐ చెప్పారు. 2024 జూన్ నుంచి జూలై 17 వరకూ కొవ్వూరు, దొమ్మేరులోని జగనన్నకాలనీ, దేవరపల్లి మండలం కృష్ణంపాలెం, గౌరీపట్నం, రాజమహేంద్రవరం రూరల్ మండలం కొంతమూరులో జరిగిన చోరీ కేసుల్లోని రూ.11,81,000 విలువైన వస్తువులను రికవరీ చేసినట్టు చెప్పారు. గంజాయి రవాణాతో పాటు ఈ ఐదు కేసుల్లో ఏడుగురు నిందితులను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్టు సీఐ విశ్వం తెలిపారు.

సత్యదేవుడి సన్నిధిలో కేంద్ర మాజీ మంత్రి పూజలు

అన్నవరం, ఆగస్టు 19: సత్యదేవుడి సన్నిధిలో సోమవారం కేంద్ర మాజీ మంత్రి, సింహాచలం దేవస్థానం చైర్మన్ పూసపాటి అశోక్ గజపతిరాజు స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈవో రామచంద్రమోహన్ ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలకగా వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. అనంతరం సత్యగిరి కొండపై నిర్మాణాలైన వేదపాఠశాల శివసదన్ కాటేజీ, ఉచితకల్యాణమండపాలను పరిశీలించారు. ఆయన వెంట సహాయకమిషనర్ విశ్వనాధరాజు, పీఆర్వో కృష్ణారావున, తదితరులు పాల్గొన్నారు.



అశోక్‌గజపతిరాజుకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈవో

గంజాయి కేసులో విలేకరుల అరెస్టు ఓ కుట్ర

- ఛత్తీస్‌గఢ్ మాజీ మంత్రులు మోహన్, కవాసి



విలేకరులతో మాట్లాడుతున్న ఛత్తీష్‌గఢ్ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు

రాజమహేంద్రవరం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్ గఢ్‌కి చెందిన నలుగురు పాత్రికేయులను గంజాయి కేసులో అరెస్టు చేయడం వెనుక బీజేపీ కుట్ర ఉందని ఛత్తీస్‌గఢ్ మాజీ మంత్రి మోహన్ మార్కవన్, మరో మాజీ మంత్రి, సిట్టింగ్ ఎమ్మెల్యే కవాసి లఖ్మ ఆరోపించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న నలుగురు పాత్రికేయులను ఆ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మార్కవన్, లఖ్మ, సిట్టింగ్ ఎమ్మెల్యే విక్రమ్ మాండవి, మాజీ ఎమ్మెల్యే రేఖ్‌చంద్ జైన్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్వరి బాగేల్, జడ్పీ చైర్మన్ హరీశ్‌కవాసి ములాఖత్‌పై సోమవారం కలిశారు. అనంతరం జైలు బయట వారు మా ట్లాడుతూ.. ఛత్తీస్‌గఢ్- ఆంధ్రా సరిహద్దులో అక్రమంగా ఇసుక తవ్వుతు న్న కాంట్రాక్టర్లను ఆ నలుగురు విలేకరులు వెళ్లి ప్రశ్నించా రన్నారు. వాళ్లకి ఆ కాంట్రాక్టర్లు మంచి మాటలు చెప్పి భోజనానికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ముందుగా వేసిన ప్లాన్ ప్రకారం భోజనం చేస్తుండగా వారి కారులో దొంగ తనంగా గంజాయిని ఉంచారని చెప్పారు. ఈ విషయం తెలియని విలేకరులు ఆ కారులో ఆంధ్రాలో ప్రవేశించగానే పోలీసులకు సమాచారం ఇచ్చారన్నారు. ఈనెల 11న సీజీ 18 ఎల్ 0698 నంబరు కలిగిన కారును చింతూరు పోలీసులు వాహన తనిఖీల్లో భాగంగా సోదా చేశారు. కారులో 3 ప్యాకెట్లలో 15కి లోల గంజాయి ఉన్నట్టు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. కారులో ఉన్న దంతెవాడజిల్లా దక్షిణ బస్తర్‌కి చెందిన బప్పిరే(ఏ3), అదే జిల్లాలోని రాంపూర్ క్యాంప్‌కి చెందిన శివేందు త్రివేది(ఏ4), సుకుమా జిల్లా నకపర వార్డుకు చెందిన ధర్మేంద్రసింగ్(ఏ5), అదే జిల్లా కుంటకు చెందిన మనీష్‌సింగ్ అనే విలేకరులను అరెస్టు చేశారన్నారు. క్రైం నెం.62/2024 అండర్ సెక్షన్ 8(సీ) రెడ్ విత్ (బీ)(2) (బీ) ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. కోర్టు ఆదేశాలతో నిందితులను సెంట్రల్ జైలుకు తరలించినట్టు పేర్కొన్నారు. విలేకరులను కేసులో ఇరికించ డానికి కారులో గంజాయిని ఉంచారని అక్కడి సీసీ కెమెరాల ద్వారా స్పష్టమైనట్లు తెలుస్తోందన్నారు. కారులో గంజా యి పెట్టారని భావిస్తున్న కుంటకు చెందిన ఇర్షాద్, పవన్ లను కేసు నమోదులో ఏ1, ఏ2లుగా పేర్కొన్నారన్నారు. వీళ్ల కోసం గాలిస్తున్నారు. సీసీ ఫుటేజీలను మాయం చేసిన ఛత్తీస్‌గఢ్ ఎస్ఐని అక్కడి పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకున్నట్టు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సుమారు 20 మందితో కూడిన కాంగ్రెస్ బృందం జైలుకు వచ్చి విలేకరులకు భరోసా ఇవ్వడం ప్రాధాన్యం సంతరించు కొంది. వారికి బెయిల్ విషయంలో సహాయం చేస్తామన్నారు. అధికార బీజేపీ ప్రభుత్వపాత్ర ఉందని ఆరోపించారు.

టాయిలెట్ ఫోటోలు అప్‌లోడ్‌పై విధి విధానాలు విడుదల

తొండంగి, ఆగస్టు 19: పాఠశాలల్లోని టాయిలెట్ ఫోటోలు ఎవరు తీయాలి, ఎవరు అప్‌లోడ్ చేయాలన్న దానిపై ప్రభుత్వం విధివిధానాలను విడుదల చేసింది. దీని ప్రకారం ఇకపై పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఐఎంఎంఎస్ యాప్‌లో టాయిలెట్ ఫోటోలను అప్‌లోడ్ చేయాల్సిన పనిలేదు. దీనికి ప్రత్యామ్నాయంగా ప్రతిరోజు సాయంత్రం సర్వే ఫారమ్ పూర్తి చేయవలసి ఉంది. దీనిలో ఆయా హాజరు, టాయిలెట్ల పరిస్థితి, రన్నింగ్ వాటర్ లభ్యత, ఎన్నిసార్లు శుభ్రపరిచారన్న వివరాలు నమోదు చేయాలి. ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రతి సోమ, గురువారాలు పాఠశాలను సందర్శించి ఐఎంఎంఎస్ యాప్‌లో ఫోటోలు అప్‌లోడ్ చేయాలి. టాయిలెట్ల శుభ్రత, వాష్‌బేసిన్, యూరినల్స్ పరిస్థితి తదితర అంశాల పై రిమార్కులతో ఫోటోలు అప్‌లోడ్ చేయాలి. వీరితో పాటు విద్యాకమిటీల అధ్యక్షులు, సభ్యులు ప్రతి బుధ ,శుక్రవారాల్లో పాఠశాలలను సందర్శించి టాయిలెట్ ఫోటోలను అప్‌లోడ్ చేయాలి. వీరికి ఐఎంఎంఎస్ యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు.

విద్యార్థినులకు ఆత్మ రక్షణపై శిక్షణ

తొండంగి, ఆగస్టు 19: ఆలిండియా మెగాస్టార్ చిరంజీవి స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం రావికంపాడు ఉన్నత పాఠశాల విద్యార్థినులకు ఆత్మ రక్షణపై ఉచిత శిక్షణ అందించారు. ఫెడరేషన్ అధ్యక్షుడు రుక్మారావు మాట్లాడుతూ తమ సంస్థ తరఫున విద్యార్థినులకు తైక్వాండో, జూడో, సైకిల్ పోలో తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి దండెం పోలారావు, తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం ఉమ్మడి జిల్లాల గౌరవాధ్యక్షులు కె.ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ ఉన్నారు.



ఏలేశ్వరంలో నిరసన చేస్తున్న సీపీఐ(ఎంఎల్) వినోద్ మిశ్రా పార్టీ నాయకులు

కోల్‌కత్తా సంఘటనపై నిరసనలు

పిఠాపురం, ఆగస్టు 19: కోలకత్తాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచారం సంఘటనకు నిరసనగా పిఠాపురంలో సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. హత్యాచారానికి పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని నినాదాలు చేశారు. విధుల్లో ఉండే వైద్యులు, వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలన్నారు. అనంతరం కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు కుంచే చిన్నా, కోనేటి రాజు, నాగేశ్వరరావు, మణి, సూర్యనారాయణ, వీరబాబు, స్టాలిన్, సత్యనారాయణ, సత్తిబాబు, గోపాలకృష్ణ, సూర్యచక్రం, గోవిందాచారి పాల్గొన్నారు.

కాకినాడ సిటీ: కోల్‌కత్తాలో పీజీ వైద్యురాలిపై జరిగిన అమానుష సంఘటనలో దోషులపై ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని అలయన్స్ జాతీయ మెంబర్‌షిప్ కోఆర్డినేటర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరావు కోరారు. పీజీ వైద్యురాలిపై హత్యాచారం, హత్యకు నిరసనగా గాంధీనగర్ ఒంటిమామిడి జంక్షన్‌వద్ద అలయన్స్ క్లబ్ ఆఫ్ కాకినాడ స్వాతి హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి క్లబ్ అధ్యక్షుడు పెంకె గోవిందరాజు ఆధ్వర్యం వహించారు. అలయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వనుం శ్రీనివాసరావు, క్లబ్ ప్రతినిధులు కె.సతీష్, దుర్గా సుభద్ర, కిరణ్‌కుమార్, కొత్త శ్రీరాములు, వనుం ఉపేంద్రనాథ్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఏలేశ్వరం: దేశంలో మహిళలకు రక్షణ కరువైందని సీపీఐ(ఎంఎల్) వినోద్ మిశ్రా పార్టీ ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి కొసిరెడ్డి గణేశ్వరరావు విమర్శించారు. పట్టణంలోని బాలాజీ చౌక్ సెంటర్‌లో నిరసన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సోమల కుశల, నాగులపల్లి అర్జునుడు, వందుల క్రాంతి కుమార్, కోమ్మయ్య, చిన్నయ్య పాల్గొన్నారు.

జగ్గంపేట: కోలకత్తాలో వైద్యురాలిపై హత్యాచారం వారిని కఠినంగా శిక్షించాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు గోవిందపురం గ్రామంలో నిరసన నిర్వహించారు. జిల్లా కమిటీ మెంబర్ జగ్గంపూడి రాజు, ఐపియా నాయకులు రబ్బల సంకురమ్మ, కోరుకొండ మరిడమ్మ, మురదాసుమంగయ్య ఉన్నారు.

ప్రపంచ ఫొటోగ్రాఫర్స్ డే వేడుకలు

పెద్దాపురం, ఆగస్టు 19: పెద్దాపురం ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్, పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రాఫర్స్ డే వేడుకలను స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజాసూరిబాబు రాజు హాజరై ఫొటోగ్రఫీ పితామహుడు డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం నేచురల్ ఫోటో కంటెస్ట్ ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో మిషన్ అన్నపూర్ణ సహాయనిధి నిర్వాహకుడు దేవత రాజేష్ కుమార్, కూనిరెడ్డి అరుణ, పలువురు ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు పాల్గొన్నారు.

సామర్లకోట: సామర్లకోటలో డాగురే చిత్రపటానికి సామర్లకోట ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తామరపల్లి దివాకర్, అడబాల శ్రీనివాస్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పేదలకు ఆహార పొట్లాలను అందజేశారు. అసోసియేషన్ నాయకులు రాము సూరిబాబు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

గండేపల్లి: గండేపల్లిలో మండల ఫొటోగ్రాఫర్ల యూనియన్ ఆధ్వర్యంలో డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రాంబాబు, సీనియర్ ఫొటోగ్రాఫర్లు సూరిబాబు, సత్తిబాబు, కోటి, మురళీ పాల్గొన్నారు.

'పేదల ఆకలి తీర్చే కూటమి ప్రభుత్వం'

సర్పవరం జంక్షన్, ఆగస్టు 19: వైసీపీ ఐదేళ్ల పాలనలో అన్న క్యాంటీన్‌ని మూసేసి పేదల కడుపు కొట్టిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి అన్న క్యాంటీన్‌ని ప్రారంభించి నిరుపేదల, అన్నార్తుల ఆకలిని తీర్చారని టీడీపీ రాష్ట్ర ఆరోగ్య విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసు అన్నారు. రమణయ్యపేట బోట్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌లో రూ.5కే అందిస్తున్న అల్పాహారం, భోజనం నిర్వహణ, అమలును పరిశీలించి పేదలకు ఆహారం వడ్డించారు. వారు మాట్లాడుతూ ఒకపూటకు రూ.3వేలు చెల్లించి అన్నదాన కార్యక్రమంలో దాతలు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాందేవు సీతయ్యదొర, దేవు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

'వేట నిషేధ భృతి తక్షణం చెల్లించాలి'

కాకినాడ సిటీ, ఆగస్టు 19: మత్స్యకారులకు వేట నిషేధ భృతి రూ.20వేలు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏటిమొగలోని మత్స్యశాఖ జిల్లా అధికారి కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ మత్స్యకార, మత్స్య కార్మిక సంఘం సభ్యులు ఆధ్వర్యం వహించారు. జాతీయ మత్స్యకార, మత్స్య కార్మిక సంఘం వర్కింగ్ కమిటీ సభ్యురాలు సీహెచ్.రమణి మాట్లాడుతూ వేట నిషేధ భృతి 15 నుంచి 20 రోజులలోపు మత్స్యకారుల ఖాతాలో జమ అయ్యేదన్నారు. ఈసారి 4 నెలలు గడుస్తున్నా ఇంతవరకు మత్స్యకారుల ఖాతాలో రూపాయి కూడా జమ కాలేదన్నారు. సంఘం జిల్లా నాయకులు ఉప్పాడ సత్యనారాయణ, సంగాడి ఈశ్వరరావు ప్రసంగించారు. మత్స్యశాఖ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. మత్స్యకార నాయకులు అప్పారావు, బి.చిన్నస్వామి, పి.కనకరాజు, అంగాడి ఈశ్వరరావు పాల్గొన్నారు.

'ఇంటింటా సర్వే నిర్వహించాలి'

సామర్లకోట, ఆగస్టు 19: ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల జాబితా సవరణ తయారీలో మంగళవారం నుంచి చేపట్టనున్న ఇంటింటా సర్వే పారదర్శకంగా నిర్వహించాలని మండల ఏఈఆర్వో, తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి అన్నారు. సామర్లకోట మండల, పట్టణ స్థాయి బీఎల్వోలకు ఓటర్ల జాబితా సర్వేపై అవగాహనా సదస్సు మున్సిపల్ కార్యాలయంలో పట్టణ ఏఈఆర్వో, మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా తహశీల్దార్ మాట్లాడుతూ మంగళవారం నుంచి ఇంటింటా ప్రారంభించే సర్వే అక్టోబరు 18 వరకూ బీఎల్వోలు నిర్వహించాలని. అక్టోబరు 19 నుంచి 28 వరకూ సదరు జాబితాలో ఉన్న పేర్లపై అభ్యంతరాలు ఉంటే స్వీకరించాలన్నారు. అనంతరం ప్రత్యేక అవగాహనా సదస్సులు నిర్వహించాలన్నారు. ప్రతీ శని, ఆదివారాలలో అప్పటివరకూ నమోదైన క్లెయిమ్‌లను పరిష్కరించాలన్నారు.

'ఆ జీవోలను రద్దు చేయాలి'

ప్రత్తిపాడు, ఆగస్టు 19: పాఠశాల అభివృద్ధికి ఆటకంగా ఉన్న 117,128 జీవోలను వెంటనే రద్దు చేయాలని జిల్లా ఏపీటీఎఫ్ నాయకులు సోమవారం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభకు వినతిపత్రం అందజేశారు. తెలుగు, ఆంగ్ల మాధ్యమాలు కొనసాగించాలని, పదోన్నతులు వెంటనే కల్పించాలని ఏపీటీఎఫ్ జిల్లా నాయకులు ఎస్.శ్రీనివాస్, జి.దుర్గాప్రసాద్, కె.సుబ్రహ్మణ్యం, కె.సత్యప్రసాద్, జి.చంద్రశేఖర్, రాజశేఖర్ కోరారు.

ముగ్గురు వాహనదారులకు జైలు శిక్ష

కాకినాడ క్రైం, ఆగస్టు 19: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురు వాహనదారులకు 2రోజుల జైలు శిక్షను న్యాయమూర్తి విధించారు. కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు ట్రాఫిక్-1, ట్రాఫిక్-2 పోలీస్‌స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించగా 29మంది మద్యం తాగినట్టు పోలీసులు నిర్ధారించారు. వారిని కాకినాడ మూడో స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా జడ్జి వి.నరసింహరావు ముగ్గురు వాహనదారులకు 2రోజులు చొప్పున జైలు శిక్ష విధించారు. 26 మందికి తలో రూ.10వేల వంతున రూ.2.60 లక్షల జరిమానా విధించినట్టు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్-1 సీఐ రమేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఎంఈవోకు గాయాలు

ప్రత్తిపాడు, ఆగస్టు 19: ప్రత్తిపాడు ఎంఈవో2 అచ్చిరాజుకు రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని ఒమ్మంగి నుంచి మోటార్ బైక్‌పై రాచపల్లి అడ్డురోడ్డు హైవే క్రాస్‌చేస్తుండగా వేగంగా వస్తున్న పల్సర్ బైక్ ఢీకొంది. ఈ క్రమంలో ముగ్గురికి గాయాలు కాగా వారిలో ఎంఈవో2 అచ్చిరాజుకు తలకు బలమైన గాయాలయ్యాయి. దీంతో అచ్చిరాజును ఎంఈవో వి.రాజబాబు, సిబ్బంది స్థానిక ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించి కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

వైభవంగా చండీహోమం

పెద్దాపురం, ఆగస్టు 19: స్థానిక మరిడమ్మ దేవస్థానంలో చండీహోమాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. శ్రావణ శుద్ధ పౌర్ణమి తిథిని పురస్కరించుకుని అమ్మవారికి 700 శ్లోకాలతో వేద పండితులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ప్రజలకు సకల శుభాలు, కార్యాలు నెరవేర్చేందుకు ఈ చండీహోమం నిర్వహించడం జరుగుతుందని పండితులు పేర్కొన్నారు. సామూహిక కుంకుమ పూజలు, అమ్మవారికి పుష్పపూజలు చేశారు.దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రామ్మోహనరావు ఉన్నారు.

తుమ్మలపల్లి రమేష్ పరామర్శ

జగ్గంపేట, ఆగస్టు 19: మండలంలో బలభద్రపురానికి చెందిన బుదిరెడ్డి శ్రీనివాస్ బావ ఇటీవల మృతిచెంద డంతో జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్‌బాబు పరామర్శించారు. మాదారపు వీరబాబు, బుదిరెడ్డి శ్రీనివాస్ తదితరులున్నారు.

రాఖీ పౌర్ణమి వేడుకలు

కాకినాడ సిటీ, ఆగస్టు 19: మహిళా సంక్షేమం, భద్రతకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. జగన్నాథపురంలోని ఎమ్మెల్యే నివాసం వద్ద రాఖీ పౌర్ణమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. అక్కాచెల్లెమ్మలకు కొండబాబు రాఖీ శుభాకాంక్షలు తెలిపారు. రక్షాబంధన్ సందర్భంగా బ్రహ్మకుమారీస్ సభ్యులు కొండబాబు చేతికి రాఖీ కట్టి ఆశీర్వదించారు. మాజీ కార్పొరేటర్ తుమ్మల సునీత, తెలుగు మహిళలు ఎమ్మెల్యే కొండబాబు చేతికి రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

సర్పవరం జంక్షన్: వలసపాకలలో కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి స్వగృహంలో రాఖీ పండుగను టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులతో నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆప్యాయంగా రాఖీలు కట్టి స్వీట్లు పంచి అక్షింతలతో ఆశీర్వాదం పొందారు. సంపర ఏఎంసీ మాజీ ఛైర్మన్ కర్రి వెంకట్రాజు, అడబాల రత్నప్రసాదరావు, ఆర్.రాజా, ఎం.ప్రకాశ్, బొజ్జ సాంబశివరావు, శర్మ, డి.భాస్కరరావు పాల్గొన్నారు. గొడారిగుంటలో రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ స్వగృహానికి ఎత్తున మహిళలు, మహిళా ఉద్యోగులు నానాజీకి రాఖీ కట్టి ఆశీస్సులు అందించారు.

పిఠాపురం: రాఖీ పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీ ఎస్ఎన్ వర్మకు రాఖీలు కట్టారు. మహిళలకు వర్మ, ఆయన సతీమణి లక్ష్మీదేవిలు రాఖీ శుభాకాంక్షలు తెలియజేశారు. పాదగయ క్షేత్రంలో స్వయంభూ దత్తాత్రేయస్వామి, అలక్‌నిరంజన్ దత్తబృందావనంలో స్వాములకు అభిషేకాలు, పుష్పార్చనలు జరిగాయి. ఔదంబర వృక్షం వద్ద పూజలు జరిపి శ్రీపాదశ్రీవల్లభులకు రాఖీలు కట్టారు. ఆలయ ఈవో, సహాయ కమిషనరు దుర్గాభవానీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. బైపాస్‌రోడ్డులోని గోపాల్‌బాబా ఆశ్రమలో ప్రత్యేక పూజలు జరిగాయి.

సామర్లకోట: రాఖీ పౌర్ణమి సందర్భంగా అచ్చంపేటలోని ఎమ్మెల్యే చినరాజప్ప స్వగృహానికి సామర్లకోట బ్రహ్మకుమారీలు లక్ష్మీ, అపర్ణలు వెళ్లి రాజప్పకు రాఖీలు కట్టి ఆశీర్వదించారు. ఎమ్మెల్యేకు పండ్లు, మిఠాయిలను అందజేశారు. సామర్లకోట మున్సిపల్ మాజీ ఛైర్మన్ డాక్టర్ చందలాడ అనంత పద్మనాభం, తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, కమిషనర్ రామారావులకు కూడా రాఖీలు కట్టారు.

కరప: కరపలో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి పార్టీ నాయకులు, కార్యకర్తలకు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి పలువురు అధికారులు, సర్పంచ్‌లకు రాఖీలు కట్టి వారి ఆశీర్వచనాలు పొందారు. కార్యక్రమాల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: రక్షాబంధన్‌ను పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో అక్కా చెల్లెళ్లు అన్నాతమ్ముళ్లకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు.

జగ్గంపేట: మండలంలో సోమవారం రాఖీ పౌర్ణమి, శ్రావణమాస పౌర్ణమి సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు ఆలయాలకు వెళ్లి దర్శించు కున్నారు.

ఏలేశ్వరం: రాఖీ పర్వదినాన్ని ఏలేశ్వరం పట్టణ, మండలంలో నిర్వహించుకున్నారు. యర్రవరంలో సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో విద్యార్థులు రక్షాబంధన్ నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ బుజ్జికి బ్రహ్మకుమారీస్ రాఖీ కట్టారు.

పెద్దాపురం: మండల గ్రామాల్లో మహిళలు తమ సోదరులకు రాఖీ కట్టి అనురాగాలను చాటుకున్నారు. వారి నుంచి ఆశీర్వచనాలు అందుకున్నారు.

కిర్లంపూడి: జగపతినగరం సర్పంచ్ గుడాల శ్రీలత రాంబాబు పంచాయతీలో రాఖీలు కట్టారు.

ప్రత్తిపాడు: స్థానిక ఓం శాంతి బ్రహ్మకుమారీస్ విశ్వవిద్యాలయానికి చెందిన బ్రహ్మకుమారీలు స్థానిక పెద్దలు, ప్రముఖులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. రాచపల్లిలోని అరుణాచల ఆల యానికి విచ్చేసిన భక్తులకు విశ్వహిందూ పరిషత్‌కు చెందిన పలువురు రాఖీలు కట్టిశుభాకాంక్షలు తెలిపారు.



కాకినాడలో ఎమ్మెల్యే కొండబాబు చేతికి రాఖీ కదుతున్న బ్రహ్మకుమారీస్ సభ్యులు



పెద్దాపురంలో సోదరుడికి రాఖీ కడుతున్న సోదరి



సామర్లకోట: ఎమ్మెల్యే రాజప్పకు రాఖీ కట్టిన బ్రహ్మకుమారీలు



పిఠాపురంలో వర్మకు రాఖీలు కడుతున్న దృశ్యం

శ్రావణ పౌర్ణమి పూజలు

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 19: గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో శ్రావణిపౌర్ణమి సందర్భంగా సోమవారం విశేషపూజలు జరిగాయి. శ్రావణమాసం, పౌర్ణమి, శ్రవణ నక్షత్రం పురస్కరించుకుని లలితాదేవికి పంచామృతాభిషేకం, సౌభాగ్య స్త్రీలతో లలితా సహస్రనామ కుంయకుమార్చన జరిగాయి. స్వామి,అమ్మవార్లను పుష్పాలతో అలంకరించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధికంగా పాల్గొన్నారు.

సామర్లకోట: సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో ఈవో బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు వేదమంత్రోచ్ఛారణల మధ్య భీమేశ్వరస్వామికి విశేష అభిషేకపూజలు, పుష్పార్చన పూజలు నిర్వహించారు. స్వామివారి శివలింగానికి రాఖీలు ధరింపజేసి పూజలు నిర్వహించారు. బాలాత్రిపుర సుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చన, విశేష పుష్పార్చన పూజలు నిర్వహించారు. పూజల అనంతరం స్వామివారిని, అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు.

కరప: గ్రామదేవత ఉప్పాలమ్మతల్లి ఆలయంలో శ్రావణ పౌర్ణమి పూజలు ఘనంగా జరిగాయి. ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, ఆలయ కమిటీ సభ్యులున్నారు

మహారాజా కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ప్రారంభోత్సవం



బ్యాంక్ ప్రారంభోత్సవంలో అశోక్ గజపతిరాజు

తుని రూరల్, ఆగస్టు 19: తునిలో మహారాజా కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ సోమవారం ప్రారంభమైంది. కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. బ్యాంక్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.రామకృష్ణంరాజు మాట్లాడుతూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం తమ బ్యాంక్ పని చేస్తుందని, తునిలో నూతన బ్రాంచ్ ఏర్పాటుకు ఆర్‌బీఐ అనుమతి లభించిందన్నారు. రూ.275కోట్ల డిపాజిట్లు సేకరించి రూ.197 కోట్ల రుణాలు అందించామన్నారు. తమ బ్యాంక్ రూ.475 కోట్లకు పైగా వ్యాపారం చేస్తూ లాభాల్లో పయనిస్తుందన్నారు. త్వరలో అనకాపల్లి, రాజమండ్రి, రామచంద్రపురం, మల్కీపురం ప్రాంతాల్లో బ్రాంచ్‌లు ప్రారంభిస్తామని వెల్లడించారు. తమ బ్యాంక్ సామాన్యులకు అందుబాటులో ఉంటుందని.. చిన్నకారు రైతులు, వ్యాపారులు, విద్యార్థులకు, గృహ నిర్మాణాలకు రుణాలు అందిస్తామన్నారు. ప్రారంభోత్సవంలో మాజీ ఎమ్మెల్యేలు రాజా అశోక్‌బాబు, కలిదిండి సత్యనారాయణరాజు, దాట్ల శ్రీనివాస రాజు, చిరంజీవిరాజు ఉన్నారు.

ఆయుకట్టుకు నీరు విడుదల



తాండవనీటిని విడుదల చేస్తున్న దృశ్యం

కోటనందూరు, ఆగస్టు 19: ఆయకట్టుకు తాండవ జలాశయం నీటిని సోమవారం ఉదయం 8.45 నిమిషాలకు ప్రాజెక్టు డీఈ పి.అనురాధ విడుదల చేశారు అనురాధ మాట్లాడుతూ కుడి కాలువ ద్వారా 250 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 150 క్యూసెక్కులు నీటిని విడుదల చేశామని.. కాకినాడ, అనకాపల్లి జిల్లాల్లో 52వేల ఎకరాలకు సాగునీరందుతుందన్నారు. ఈ సంవత్సరం నీరు పూర్తిస్థాయిలో పంటకు సరిపడుతుందని, నీరు కోసం ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు. ముందుగా వినాయకుడు, నల్లగొండమ్మతల్లికి పూజలు చేశారు. కార్యక్రమంలో అధికారులు శ్యామ్, రవి, వినయ్, కరకసత్యనారాయణ,నందిపల్లి వెంకటరమణ పాల్గొన్నారు.

తిరుగుముఖం పట్టిన అర్జీదారులు

సామర్లకోట, ఆగస్టు 19: సామర్లకోట ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మండల స్థాయి అధికారుల గ్రీవెన్స్‌సెల్ కార్యక్రమానికి రావాల్సిన మండలస్థాయి అధికారులందరూ వేర్వేరు విధులకు హాజరైనట్టు ప్రకటించడంతో మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల నుంచి సామర్లకోటకు చేరుకున్న అర్జీదారులు అధికారులు లేక నిరాశగా తిరుగుముఖం పట్టారు. జిల్లా అధికారులు స్పందించి గ్రీవెన్స్ సెల్ సామర్లకోటలో సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



జగ్గంపేట, ఆగస్టు 19: గోకవరం రోడ్డులో మోడల్ డిగ్రీ కళాశాల సమీపంలో ఉన్న పోలవరం కాలువలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్టు జగ్గంపేట ఎస్ఐ రఘునాధరావు తెలిపారు. కాలువలో పురుషుడి మృతదేహం తేలియాడుతున్నట్టు సమాచారం రావడంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశామన్నారు. ఆచూకీ తెలిసినవారు 9440796569 జగ్గంపేట పోలీసులకు సమా చారం అందించాలని కోరారు.

ప్రజా వినతులను వేగంగా పరిష్కరించాలి

» కలెక్టరు సగిలి షాన్‌మోహన్ » పిఠాపురంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

పిఠాపురం, ఆగస్టు 19: ప్రజలు నుంచి అందిన వినతులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని రథాలపేట సెంటర్‌లో గల అంబేడ్కర్ మల్టీపర్పస్ కమ్యూనిటీహాలులో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక నిర్వహించారు. ట్రైనీ కలెక్టర్ హెచ్ఎస్ భావన, కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్‌లతో కలిసి ప్రజలు నుంచి వినతులు స్వీకరించారు. సంబంధిత అధికారులకు పరిష్కారం నిమిత్తం ఇచ్చారు. ప్రజలకు ఇచ్చిన ఫిర్యాదులపై సంతృప్తికరంగా, సమగ్రమైన పరిష్కారాలు అందించాలని సూచించారు. వినతుల పరిష్కారంలో అలక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వినతులన్నింటిని పరిష్కరించడమే లక్ష్యంగా అధికారయంత్రాంగం పనిచేస్తున్నదని తెలిపారు. వినతులు, పరిష్కారాల ప్రగతిపై ప్రతి శనివారం సమీక్షిస్తున్నట్లు చెప్పారు. పింఛన్ల మంజూరు, టిడ్కో గృహాల అప్పగింత, ఇళ్లస్థలాలు, భూముల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు, ఆక్రమణల తొలగింపు, డ్రెయిన్లల్లో పూడిక తొలగించక పడుతున్న ఇక్కట్లు, గ్రామాలు, పట్టణాల్లో అపారిశుధ్య పరిస్థితులు, సదరం ధృవీకరణపత్రాల మంజూరు, ఉద్యోగాలు, ఉపాధి కల్పన తదితర అంశాలపై అధికంగా ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో పెద్దాపురం డీఎల్‌డీవో ప్రసాదరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పిఠాపురంలో సమస్య వింటున్న కలెక్టర్

గ్రీవెన్స్‌లో ఫిర్యాదు

కాకినాడ రూరల్, ఆగస్టు 19: రూరల్ మండలం రేపూరు, కొవ్వాడ, గంగనాపల్లి, చీడిగ తదితర గ్రామాల్లో ఇరిగేషన్ కాలువలను పూడ్చివేసి అనధికార లేఅవుట్‌లలో కలిపివేస్తున్నారని వాటిని సర్వేచేసి అనధికార లేఅవుట్‌లలో వేసిన రోడ్లను తొలగించాలని జనసేన ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి శిరంగుశ్రీనివాసరావు కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో సోమవారం ఫిర్యాదుచేశారు. తూరంగిలో అనధికారిక కట్టడాలు, నాన్ లేఅవుట్‌ల దారుల ఇరిగేషన్ కాలువల ఆక్రమణలపై మాజీ ఎంపీటీసీ వి.త్రిమూర్తులు ఫిర్యాదు చేశారు.

భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలి : డీఈవో



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో రమేష్

సర్పవరం జంక్షన్, ఆగస్టు 19: శాస్త్రీయ దృక్పథం, సమాజానికి ఉపయోగపడే ఆలోచనలు కలిగిస్తూ భావి శాస్త్రవేత్తలుగా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత సైన్స్ ఉపాధ్యాయులపై ఉందని జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ అన్నారు. సోమవారం పండూరు హైస్కూల్లో కాకినాడ రూరల్, సిటీ, సామర్లకోట, పెదపూడి మండలాలకు చెందిన 70 మంది ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులతో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ విషయాన్ని సృజనాత్మకతతో ఆలోచించేవిధంగా విద్యాబోధన సాగాలన్నారు. తరగతి బోధనతో పాటూ క్షేత్ర స్థాయి పర్యటనలతో విద్యాసామర్థ్యాలను మరింత పెంచవచ్చన్నారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి అభ్యసనా సామర్థ్యాలను పరిక్షించారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ, అమలును పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ ఆఫీసర్ వినీల్, హెచ్ఎం సూర్యప్రకాశిని పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

రౌతులపూడి, ఆగస్టు 19: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం విషయంలో ఏజెన్సీ నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలని రౌతులపూడి హైస్కూల్ విద్యా కమిటీ ఛైర్మన్ షేక్ సలీం అన్నారు. సోమవారం హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. రోజూ సక్రమంగా భోజనం వచ్చేలా చూడాలని సూచించారు.

తొండంగి ఎస్ఐగా జగన్మోహన్

తొండంగి, ఆగస్టు 19: తొండంగి ఎస్ఐగా జగన్మోహన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఇక్కడ బాధ్యతలు నిర్వహించిన వినయ్ ప్రతాప్ కాకినాడ వీఆర్‌కు బదిలీపై వెళ్లారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన జగన్మోహన్‌ను పోలీసు సిబ్బంది అభినందించారు. సీనియర్ టీడీపీ నేతలు యనమల రాజేష్, కొయ్యా రామకేశవ తదితరులు ఆయన్ని కలిసి అభినందనలు తెలిపారు.

'ప్రతీ సమస్యను పరిష్కరించాలి'

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 19: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా వచ్చిన ప్రతిఒక్క సమస్యను సత్వరమే పరిష్కరించాలని కాకినాడ కమిషనర్ భావన ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని, అనంతరం ప్రజా పరిష్కార వ్యవస్థను కమిషనర్ నిర్వహించారు. డయల్ యువర్ కమిషనర్ ద్వారా ఇంజనీరింగ్, ప్రజారోగ్యం, టౌన్‌ప్లానింగ్, యూపీఏ విభాగాలకు సంబంధించి 18మంది ఫోన్ ద్వారా సమస్యలు విన్నవించారు. ఆయా సమస్యలు సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో భాగంగా నేరుగా ప్రజల నుంచి కమిషనర్ వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఈలు పి.సత్యకుమారి, వెంకటరావు, ఈఈ మాధవి, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, డీసీపీ హరిదాస్, మేనేజర్ కర్రి సత్యనారాయణ ఉన్నారు. హౌసింగ్‌కు సంబంధించి నిర్దేశించిన వంద రోజుల లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు అధికారులు, లేబర్ ఏజెన్సీలు కృషిచేయాలని కమిషనర్ భావన సూచించారు. నగరపాలక సంస్థలో మెప్మా, హౌసింగ్ తదితర శాఖల అధికారులతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. కొమరగిరి లేఅవుట్‌లో గృహ నిర్మాణాలపై సమీక్షించారు. అక్టోబర్ చివరినాటికి వీటన్నింటినీ పూర్తి చేయాలని సూచించారు. మొత్తం 1103 ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి వందరోజుల యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయాలని ఆదేశించారు. హౌసింగ్ పీడీ అండ్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై.శ్రీనివాస్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కెఎస్ఎన్ రెడ్డి పాల్గొన్నారు.

రాజరాజేశ్వరీగా వనదుర్గ



అన్నవరం, ఆగస్టు 19: రత్నగిరి క్షేత్రరక్షకి వనదుర్గమ్మవారి శ్రావణ మాసోత్సవాలు సోమవారంతో ముగిశాయి. చివరిరోజున అమ్మవారిని రాజరాజేశ్వరీగా అలంకరించారు. ఆలయంలో చండీ, ప్రత్యంగిరి హోమా లు నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. 5రోజులపాటు అర్చకస్వాములు హోమాలు, జపములు, పారాయణలు, కుంకుమపూజలు నిర్వహించగా చివరిరోజున పూర్ణాహుతి చేపట్టారు. కార్యక్రమంలో ఈవో రామచంద్రమోహన్ కుటుంబసభ్యులతో హాజరయ్యారు.

ముగిసిన పవిత్రోత్సవాలు



మహాపూర్ణాహుతిలో అధికారులు, వేదపండితులు

పిఠాపురం, ఆగస్టు 19: తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహణలో పట్టణంలో ఉన్న రుక్మిణి సత్యభామ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో 4 రోజులుగా జరుగుతున్న పవిత్రోత్సవాలు సోమవారంతో ముగిశాయి. పవిత్ర ప్రతిష్ఠ, పవిత్ర సమర్పణ కార్యక్రమాల అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య మహాపూర్ణాహుతి వైభవంగా జరిగింది. కార్యక్రమాల్లో టీటీడీ సూపరింటెండెంట్ ఎం.మల్లిఖార్జున, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ఎం.సందీప్, విజిలెన్స్ జమేదార్ ఎం.చినశ్రీనివాసరావు, టీటీడీ వేదపండితులు పాల్గొన్నారు.

ఘనంగా సంతోషిమాత ఉత్సవాలు

ప్రత్తిపాడు, ఆగస్టు 19: ప్రత్తిపాడు గోవిందపురం కొండ జంక్షన్ వద్ద ఉన్న సంతోషి మాత అమ్మవారి జన్మదిన మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి విగ్రహానికి అభిషేకాలు, సహస్ర కుంకుమార్చనలలో పెద్ద ఎత్తున మహిళా భక్తులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యప్రభను ఆలయ కమిటీకి చెందిన కణపర్తి సత్యనారాయణ, శ్రీనివాస్, ప్రకాష్ ఘనంగా సన్మానించారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు.

విద్యార్థినులకు యూనిఫాం పంపిణీ



కరప, ఆగస్టు 19: బాలికలు చదువుతో బాటు అన్ని రంగాల్లో రాణించాలని సానా సతీష్‌బాబు ఫౌండేషన్ ఛైర్మన్ తలాటం హరీష్ సూచించారు. కరప హైస్కూల్‌లో ప్లస్ టు విద్యార్థినులకు సోమవారం ఫౌండేషన్ తరఫున 50జతల యూనిఫాం దుస్తులను ఆయన అందజేశారు. ఔత్సాహిక క్రీడాకారులను ఫౌండేషన్ ద్వారా ఆదుకుంటున్నామని తెలిపారు. సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, రిటైర్డ్ మున్సిపల్ కమిషనర్ వెన్నా చక్రధర్‌రావు, హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు, పీజీటీ ఉపాధ్యాయులు ఎల్.సత్యనారాయణ, నక్కా బుజ్జి, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, నాయకులు భోగిరెడ్డి కొండబాబు, శాకా శ్రీనివాస్, నక్కా భద్రం తదితరులు పాల్గొన్నారు.

లైన్‌మెన్‌కు సన్మానం

గండేపల్లి, ఆగస్టు 19: మల్లేపల్లిలో విద్యుత్ లైన్‌మెన్‌గా ఉత్తమ సేవలందించినందుకు పాకలపాటి శ్రీనివాస్‌రాజును సోమవారం సత్కరించారు. సర్పంచ్ బలిరెడ్డి వరలక్ష్మిగంగరాజు అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి కట్టా చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రాజుకు పుష్పగుచ్ఛమందజేసి సన్మానించారు. పంచాయతీ వార్డుమెంబర్లు రామకుర్తి నాగేశ్వరరావు, గొల్లవిల్లి లోవ రామకృష్ణ, దార్లంక నూకరాజు, లైన్‌మేన్ మైలవరపు మణికంఠ, అసిస్టెంట్ లైన్‌మెన్ వెంకటరమణ ఉన్నారు.

ఎంబీఏ, ఎంసీఏ స్పాన్సర్డు సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

జేఎన్టీయూకే, ఆగస్టు 19: వర్సిటీలోని ఎంబీఏ, ఎంసీఏ స్పాన్సర్డు కోటా సీట్ల భర్తీకి కౌన్సెలింగ్‌ను సోమవారం సెనేట్ హాల్లో నిర్వహించారు. రెక్టార్ కేవీ రమణ, ప్రిన్సిపాల్ మోహన్‌రావు, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్(ఎస్ఎంఎస్) డైరెక్టర్ ప్రొఫెసర్ ఏ.కృష్ణమోహన్, అడ్మిషన్స్ డైరెక్టర్ ఏఎం ప్రసాద్.ప్రొఫెసర్ ఎంహెచ్ఎం కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు ఎంబీఏకు 17మంది దరఖాస్తు చేసుకోగా 9సీట్లు, ఎంసీఏ కోసం 12 మంది దరఖాస్తు చేసుకోగా 8సీట్లు భర్తీ అయినట్టు కృష్ణమోహన్ తెలిపారు.

యువతకు అవగాహన

జీజీహెచ్(కాకినాడ), ఆగస్టు 19: హెచ్ఐవీపై యువత అవగాహన ఉండాలని ప్రాజెక్టు మేనేజర్ దుర్గాభవాని కోరారు. భానుగుడి జంక్షన్ ఫైడా డిగ్రీ కాలేజీలో మీకు తెలుసా కార్యక్రమంలో భాగంగా యువతకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఐసీ బుజ్జిబాబు, రత్నంరాజు, జేబీ సరోజినీ, ఏఆర్‌టీ కౌన్సిలర్ ప్రసాద్, కాలేజీ ప్రిన్సిపాల్ పాపయ్యరాజు, వైస్ ప్రిన్సిపాల సూర్య విశ్వనాథ్ పాల్గొన్నారు.